క్లుప్తంగా

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్ : వరంగల్ పరిధి చార్‌బౌళి వాటర్ ట్యాంక్ యందు వాల్వ్ దెబ్బ తినడంతో మరమ్మతు పనులు కొనసాగుతున్నందున బుధవారం వాటర్ ట్యాంక్ పరిధిలో నీటి సరఫరా బంద్ ఉంటుందని బల్దియా ఈఈ రాజు శ్రీనివాస్ తెలిపారు. ట్యాంక్ పరిధిలోని గిర్మాజీపేట, మండిబజార్, నిజాంపుర, రాధికా టాకీస్ గల్లీ, లక్ష్మీపురం, పాత,కొత్త చార్‌బౌళి ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబారెడ్డి తెలిపారు. కేయూ క్రాస్ రోడ్డు, హరిహర అపార్ట్‌మెంట్స్, శంకర్‌నగర్, భారతీ విద్యాభవన్, మైనార్టీ కాలేజీ ప్రాంతంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, శంకర్‌నగర్, ఆదర్శనగర్, సమ్మయ్యనగర్, కుడా కాలనీ ప్రాంతంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, బాలసముద్రం స్విమ్మింగ్ పూల్, ఎల్ఐసీ కార్యాలయం, నక్కలగుట్ట మెయిన్‌రోడ్డు, రమేష్ స్కిన్ డాక్టర్, అంబేద్కర్ కూడలి ప్రాంతంలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల జారీ

కాజీపేట: మండలంలోని తరాలపల్లి, రాంపేట గ్రామాల్లో మంగళవారం 120 మంది పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు జారీ చేశారు. రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ కాజీపేట బ్రాంచ్ కమిటీ అధ్యక్షుడు కె.సంగమయ్య సర్టిఫికెట్ల నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజనల్ అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్.బాబురావు, పి.వెంకటేశ్వర్లు, మారపాక కట్టస్వామి, కేవీ రావు, సాధినేని సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత

మామునూరు : ఖిలావరంగల్ మండలం తిమ్మాపురం గ్రామంలో జనచైతన్య పురుషుల పొదుపు సంఘ సభ్యుడు బండి కొమురయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం మృతుడి నామినికి సంఘం ప్రతినిధులు రూ.2.70లక్షల బీమా సొమ్మును అందజేశారు. ప్రతాపరుద్ర పొదుపు సమితి అధ్యక్షుడు మందల సుదర్శన్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు మాచర్ల రంజిత్‌కుమార్, డైరెక్టర్లు, గణకుడు కల్లెపు రాము పాల్గొన్నారు

యువతికి ఆర్థిక సాయం



వరంగల్ చౌరస్తా : వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం సేవా దృక్పథంతో కల్యాణమస్తు పథకం ద్వారా ఓ నిరుపేద యువతి అయిన తోట చందనకు ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం వరంగల్ ఆర్ఎన్‌టీరోడ్డులోని వైశ్య భవన్‌లో అధ్యక్షుడు గుండా ప్రకాశ్‌రావు తోట లక్ష్మి, రాజు దంపతుల కుమార్తె చందన వివాహానికి మంగళ సూత్రాలు, మిట్టెలు, రూ.2,516 నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అజయ్ కుమార్, మౌనిక, మంజుల, రమ, రమాదేవి, లావణ్య పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

హన్మకొండ : అసెంబ్లీ సాధారణ ఎన్నికల సందర్భంగా నమోదైన కేసులో మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ కోర్టుకు హాజరయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో స్పెషల్ పొలిటికల్ కేసుల విచారణ జరిగింది. ఈ విచారణకు వినయ్‌భాస్కర్‌తో పాటు బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కన్వీనర్ తాళ్లపెల్లి జనార్ధన్‌గౌడ్ హాజరయ్యారు.

సేవలు చిరస్మరణీయం

వరంగల్ చౌరస్తా : విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభను కనబరుస్తూ, అహర్నిశలు వృత్తి పరమావధిగా పనిచేస్తూ, బెస్ట్ లైన్‌మెన్‌గా పెగడ వెంకటయ్య అవార్డును అందుకోవడం 327 యూనియన్ సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అభినందనీయమన్నారు. మంగళవారం వరంగల్ పోతన రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో తాజాగా ఉద్యోగ విరమణ పొందిన వెంకటయ్య దంపతులను పుష్పగుచ్ఛాలతో సత్కరించి, సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు. నాయకులు మహేందర్ రెడ్డి, బుచ్చయ్యగౌడ్ , టీవీ రమేష్, ఎస్ఈలు, డీఈలు, ఏడీలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వరంగల్ చౌరస్తా : ఆర్థిక మోసాలను అరికట్టేందుకు వినియోగదారులందరూ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ మేనేజర్ రాజేష్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం వరంగల్ ఫోర్ట్ రోడ్డు, కాకతీయ విశ్వ విద్యాలయా శాఖల పునరుద్ధరణ సేవలను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కస్టమర్లు అందుబాటులో ఉన్న సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ సౌకర్యం 1930ను తెలుసుకోవాలని వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లెక్కలతో విద్యార్థుల కుస్తీ

- పాఠశాలల్లో 'సాక్షి' మ్యాథ్ బీ పరీక్షలు
- మ్యాథ్ బీ కీ విశేష స్పందన



తేజస్వి హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



పరీక్షను పర్యవేక్షిస్తున్న షైన్ స్కూల్ ప్రిన్సిపాల్ విశాల్

హసన్‌పర్తి: పరీక్ష హాల్‌లో విద్యార్థులు లెక్కలతో కుస్తీ పట్టారు. ఆలోచనకు పదును పెడుతూ సమాధానాలు రాశారు. మంగళవారం 'సాక్షి' ఆధ్వర్యంలో మంగళవారం 'మ్యాథ్ బీ' ప్రాథమిక స్థాయి పరీక్ష నిర్వహించారు. వరంగల్‌లోని తాళ్లపద్మావతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్, భవిష్య హైస్కూల్ , తేజస్వి, రామన్, షైన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ , క్రియేటివ్ హైస్కూల్, సాయి ట్యూటోరియల్స్, సెయింట్ పీటర్స్ సీబీ ఎస్ఈ స్కూల్, క్రియేటివ్ హైస్కూల్‌తో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులు వారికి కేటాయించిన కేంద్రాల్లో పరీక్షలు రాశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రతిభ పాటవాలను పరీక్షించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి వరంగల్ 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి పోటి పరీక్షతో గణితంపై పట్టు పెరుగుతోందన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో 'సాక్షి' ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటుందన్నారు. ఇలాంటి కార్యక్రమంలో పాఠశాలల విద్యార్థులు పాలు పంచుకోవాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 95055 14424 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి, ఈవెంట్స్, ఎడిషన్ ఇన్‌చార్జ్ లింగయ్య, మేనేజర్ ఎస్.సుమన్ గుప్తా, సాక్షి బృంద సభ్యులు పాల్గొన్నారు.

'సాక్షి' మ్యాథ్ బీ తో విజ్ఞానం పెరుగుతుంది



సాక్షి మ్యాథ్ బీ పరీక్షలతో విజ్ఞానం పెరుగుతుంది. హైస్కూల్ స్థాయిలోనే విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కలుగుతోంది. ఇలాంటి పరీక్షలు మరిన్ని సాక్షి నిర్వహించాలి. - జి.ఆరాధ్య, 8వ తరగతి, భవిష్య హైస్కూల్, హనుమకొండ

ప్రతి అంశంపై అవగాహన



సాక్షి మ్యాథ్ బీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల కొత్త విషయాలను తెలుసుకున్నాను. ప్రతి అంశంపై అవగాహన కలిగింది. భవిష్యత్‌లో రాసే పోటీ పరీక్షలకు మ్యాథ్ బీ ఎంతగానో దోహదపడుతుంది. - ఎల్. సిరి, 8వ తరగతి,

సమయం ఆదా



మ్యాథ్ బీ పరీక్ష వల్ల సమయం ఎలా ఆదాయం చేసుకోవాలో తెలిసింది. తక్కువ సమయంలో ఎక్కువ సమాధానాలు రాయవచ్చని 'సాక్షి' మ్యాథ్ బీ వల్ల తెలిసింది. -కె. ఆలేఖ్య,

ఉన్నత చదువులకు ఉపయోగకరం



ఇలాంటి పరీక్షలు ఉన్నత చదువులకు ఎంతో దోహదపడుతాయి. గణిత విద్యకు ఇది ఒక వారధిగా ఉపయోగపడుతుంది. - జి.దేవాంశ్, 4వ తరగతి, రామన్ స్కూల్

మ్యాథ్ పై పట్టు వచ్చింది



సాక్షి మ్యాథ్ బీ పరీక్ష రాయడం వల్ల ప్రాథమిక స్థాయి విద్యార్థులకు గణితంపై భయం పోయి మంచి పట్టు వస్తుంది. ఇలాంటి పోటీ పరీక్షలు భవిష్యత్‌లో చాలా ఉపయోగపడుతాయి - హబీబా, 4వ తరగతి, లర్నర్స్ ల్యాండ్ స్కూల్

యువత క్రీడల్లో రాణించాలి

- సీపీ అంబర్‌కిషోర్‌ఝా



షటిల్ ఆడుతున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

వరంగల్ స్పోర్ట్స్ : క్రీడల్లో రాణించినప్పుడే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని, అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగల్గుతారని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా యువతకు సూచించారు. హనుమకొండ ములుగురోడ్, ఐశ్వర్య గార్డెన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన గేమ్ పాయింట్ మల్టీస్పోర్ట్స్ సెంటర్‌ను మంగళవారం సీపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, బాస్కెట్‌బాల్ ఆటలు ఆడి యువతలో ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో గేమ్‌పాయింట్ అందుబాటులోకి రావడం క్రీడల పట్ల మరింత ఆసక్తి పెంపొందిస్తుందన్నారు. సంస్థ వ్యవస్థాపక ప్రతినిధులు ఆదిత్యరెడ్డి, సిద్దార్థరెడ్డిలు మాట్లాడుతు క్రీడా సంస్కృతిని పెంపొందించడమే తమ లక్ష్యమన్నారు. శిక్షణ, ఫిట్‌నెస్ లాంటి వివరాల కోసం 70327 77333 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

దళిత హోదా కల్పించాలి

హన్మకొండ చౌరస్తా: దళిత క్రైస్తవులకు ఇతర దళితులతో సమానమైన హక్కులను వర్తింపజేయాలని తెలుగు రాష్ట్రాల క్రైస్తవ సమాఖ్య జనరల్ సెక్రటరీ అశోక్‌కుమార్ అన్నారు. హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్టు చర్చిలో మంగళవారం తెలుగు రాష్ట్రాల క్రైస్తవ సమాఖ్య ఆధ్వర్యంలో దళిత క్రైస్తవులకు దళిత హోదా అంశం పై సదస్సు నిర్వహించారు. వరంగల్ మేత్రాణులు డాక్టర్ ఉడుమల బాల అధ్యక్షత వహించగా అశోక్‌కుమార్ హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పులను అనుసరించి దళిత క్రైస్తవులకు ఇతర దళితులతో సమానంగా హక్కులను కల్పించలేని యెడల హక్కుల ఉల్లంఘనే అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు మోసెస్ ఆనంద్‌కుమార్, ఎక్లేసియా మినిస్ట్రీ బిషప్ కళ్యాణపు డేనియల్, బిషప్ జాన్‌మార్కండేయ, పాస్టర్ దామెర ఐజక్, ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలి

హన్మకొండ అర్బన్ : ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని మంగళవారం దివ్యాంగ ఉపాధ్యాయులు సీపీఓ సత్యనారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తాము విధులు నిర్వహిస్తూ సర్వే చేయలేమని కోరారు.

టీచర్లు విద్యార్థులతో మమేకం కావాలి

విద్యారణ్యపురి: నిరంతర విద్యార్థిగా ఉంటూ ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకం అయి విద్యా బోధన చేయాలని హైదరాబాద్‌లోని ఫ్యూజిన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ , రిసోర్స్ పర్సన్ డాక్టర్ టి.పద్మావతి కోరారు. మంగళవారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ ఎడ్యూస్కూల్‌లో సీబీఎస్ఈ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్ రామాంతాపూర్ పబ్లిక్‌స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. స్కూల్ హెచ్‌ఎం హరిత, సెక్రటరీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు కెనరాబ్యాంకు చేయూత

విద్యారణ్యపురి: హనుమకొండలోని రీచ్ చిల్డ్రన్స్ హోంలోని విద్యార్థులకు కెనరా బ్యాంకు హనుమకొండ రీజినల్ కార్యాలయం వారు చేయూతనిచ్చారు. మంగళవారం రూ.5వేలకు పైగా విలువచేసే వాటర్ ప్యూర్‌ఫైర్, గ్లీజర్, నోట్‌బుక్స్, పెన్నులను ఇతర ఉపకరణాలు, పండ్లను బ్యాంకు వారు అందజేశారు. బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ బి.చంద్రశేఖర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్స్ శాంతికుమార్, కె మాధవి, డీఎం సంజీవ్‌కుమార్, డీజీఎస్ రవి, బీఎం యువజ్యోతి ఇంద్రజ ఆఫీసర్ శ్రీనివాస్‌తో కలిసి చిల్డ్రన్స్‌హోమ్ నిర్వాహకులు జాన్సన్ ప్రసాద్‌కు విద్యార్థుల మధ్య అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

దేశాయిపేట : పైడిపల్లి సమీపంలోని మద్దెలకుంట సాయిబాబా ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పైడిపల్లికి చెందిన ఈసంపల్లి బాలుకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు ఇంతేజార్‌గంజ్ సీఐ షుకుర్ తెలిపారు. ఈనెల 3న బాలు అతని స్నేహితుడు మునియాల భరత్‌లు పల్సర్‌బైక్‌పై పైడిపల్లి నుంచి వరంగల్‌కు వస్తున్న క్రమంలో సాయిబాబా ఆలయం వద్ద వరంగల్ నుంచి పైడిపల్లికి వెళ్తున్న ఆటో ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందన్నారు. బాలు బంధువులు కలువల మంజుల, చిరంజీవిల ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుల గణనలో బీసీలంతా పాల్గొనాలి

నయీంనగర్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కులగణనలో బీసీలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కుల జనగణనకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసినందుకు సిఎం రేవంత్‌రెడ్డికి బీసీల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పారా త్రోబాల్ చాంపియన్‌షిప్‌కు సీడీయూ విద్యార్థి



నయీంనగర్: కాంబోడియాలో జరగనున్న అంతర్జాతీయ పారా త్రోబాల్ చాంపియన్‌షిప్‌కు హనుమకొండ కిషన్‌పుర చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీ విద్యార్థి గదిపల్లి ప్రశాంత్ ఎంపికయ్యాడు. డిసెంబర్ 2 నుంచి 5 వరకు ఫ్నోంపెన్ నేషనల్ మల్టీపర్పస్ స్టేడియంలో జరగనున్న టోర్నమెంట్‌లో భారత జట్టుకు ప్రశాంత్ నాయకత్వం వహించనున్నాడు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన ప్రశాంత్ సీడీయూలో ఇంజనీరింగ్ లో పీహెచ్‌డీ చేస్తున్నాడు.

పత్తి దిగుమతులను నిషేధించాలి

వరంగల్: కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులను నిషేధించి పత్తిలో తేమ శాతం పెంచి కనీస మద్దతు ధరలతో కొనుగోళ్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఎన్నికల కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, కిసాన్ ఖేత్ మజ్దూర్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శశిభూషణ్ కాచే అన్నారు. సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రధానీ మోదీకి రాసిన లేఖను సీసీఐ వరంగల్ జనరల్ మేనేజర్ అర్జున్ ఎస్.ధవేకు వినతిపత్రం సమర్పించారు. శశిభూషణ్ మాట్లాడుతూ పత్తి దిగుమతి నిర్ణయం వ్యాపారులకు అనుకూలమని, కేంద్రం రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు వారి వద్దనే కొనుగోలు చేయాలని కోరారు. సీసీఐ వద్ద 11 లక్షల మిలియన్ బేళ్ల అమ్ముడు పోకుండా నిల్వలు ఉన్నాయన్నారు.

బీఎస్ఎఫ్ జవాన్‌కు ఘనస్వాగతం

మడికొండ: బీఎస్ఎఫ్‌లో 23 ఏళ్ల ఉద్యోగం ఏసీ రిటైర్‌మెంట్ తీసుకొని సొంత గ్రామానికి విచ్చేసిన కట్ట హరిబాబుకు కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పూలమాలలతో, శాలువాలతో సన్మానం చేసి స్వాగతం పలికారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

హన్మకొండ: అసెంబ్లీ ఎన్నికల ముందు ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆర్టీసీ జేఏసీ వరంగల్ రీజియన్ నాయకులు ఎం.శ్రీనివాస్, సి.హెచ్.యాకస్వామి, జి.పాణి డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్ కలెక్టర్ సత్యశారద అందుబాటులో లేకపోవడంతో అందుబాటులో ఉన్న అధికారికి వినతిపత్రం అందించారు.

డీఎంహెచ్‌ఓను కలిసిన నాయకులు

ఎంజీఎం : నూతనంగా హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అప్పయ్యను సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ గోపాలపురం నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలను పటిష్టం చేసేందుకు సిబ్బంది కొరత తీర్చాలని కోరారు.

అనాథ పిల్లలకు స్వెటర్ల పంపిణీ

హన్మకొండ చౌరస్తా : హనుమకొండ వడ్డేపల్లిలోని సాయిస్పందన ఆశ్రమంలోని 44 మంది అనాథ పిల్లలకు మంగళవారం రిటైర్డ్ ఎంఈఓ దేవా స్వెటర్లను అందజేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: రీసెర్చ్ స్కాలర్స్– 2024 కాంక్లేవ్ కార్యక్రమాన్ని ఐఎస్ఎస్ఎస్ వీఎస్ఎస్, జేఎన్‌టీయూ సంయుక్తంగా ఈనెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో నిర్వహించనున్నామని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు అన్నారు. ఏబీవీపీ కే యూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం క్యాంపస్‌లో పరిపాలనా భవనం వద్ద జోనల్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

తెలంగాణ పోరాట యోధులను ఆదుకోవాలి

నయీంనగర్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన యోధులను ఆదుకోవాలని తెలంగాణ పోరాట యోధుల సంఘం బాధ్యులు ననుమాస స్వామి, రవీందర్, రామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

ఆటో కార్మికులకు అండగా ఉంటాం..

ఖిలా వరంగల్: ఆటో కార్మికులకు అండగా ఉంటామని, కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పొట్టకొట్టిందని, ఇప్పటికే లక్షలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారని, ఆటో కార్మికుల నెలకు రూ.12వేలు ఇవ్వాల్సిందేనని, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.20లక్షల పరిహారం అందజేయాలని మాజీ ఎమ్మెల్యే నరేందర్ అన్నారు. ఆటో కార్మికుల సమస్యలపై చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టగా.. మంగళవారం నరేందర్ హాజరై కార్మికులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు.

మూల్యాంకనం రెమ్యునరేషన్ చెల్లించాలి

విద్యారణ్యపురి: ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనం విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్‌ను వెంటనే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు ఇతర బాధ్యులు మంగళవారం డీఈఓ వాసంతికి వినతిపత్రం సమర్పించారు.

ఉద్యమ కళాకారులను ఆదుకోవాలి

మడికొండ: తెలంగాణ ఉద్యమ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కళాకారులు డిమాండ్ చేశారు. మడికొండలోని రాజరాజేశ్వర గార్డెన్‌లో ఉమ్మడి వరంగల్ ఉద్యమకారుల సదస్సు నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

108లో మగబిడ్డకు జన్మనిచ్చిన తల్లి

కాజీపేట: కాజీపేటలో 108 వాహన సిబ్బంది పురుటి నొప్పులతో బాధపడుతున్న మహిళకు కాన్పు చేయగా పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామానికి చెందిన తులసి కుటుంబ సభ్యులు మంగళవారం 108 వాహనానికి ఫోన్ చేశారు. అప్పటికే నొప్పులతో బాధపడుతున్న తులసిని ఈఎంటి శివకుమార్, పైలెట్ కుంట రవిలు సాయం అందించారు. కాజీపేట శివారులోకి వచ్చేసరికి తులసి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డలు క్షేమంగా ఉన్నారు.

రైల్వే ఆలయంలో అన్నదానం

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే దేవాలయ సముదాయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. సుమారు 380 మంది భక్తులు పాల్గొన్నట్లు ఎ.ఎస్.ఆర్.ప్రసాదరావు తెలిపారు.

మార్చురీలో ఫ్రీజర్ బాక్సులు ఏర్పాటు చేయాలి



ఎంజీఎం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఎంజీఎం : ఎంజీఎం మార్చురీలో ఫ్రీజర్ బాక్స్‌లు పని చేయకపోవడంతో పార్థివదేహాలు త్వరగా డీకంపోజ్ అవుతున్నాయని వెంటనే నూతన ఫ్రీజ్ బాక్స్‌లను, ఉన్న వాటిని పర్మనెంట్‌గా మరమ్మతు చేయించాలని తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ అధ్యక్షుడు కె.మల్లారెడ్డి, సలహాదారు రాజేంద్రప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వారు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళిని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే ఎంజీఎంలో నేత్ర దానానికై ఐసీయూలో, ఇతర వార్డుల్లో చికిత్స పొందుతూ మరణించిన వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి సంబంధించి సమాచారాన్ని నర్సింగ్ ఆఫీసర్స్, సిబ్బంది సమీపంలోని ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ నిపుణులకు సమాచారం అందించి నేత్రదానానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హనుమకొండ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యుగేందర్, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును ప్రక్షాళన చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి

మడికొండ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు మడికొండలో ఇచ్చిన హామీ మేరకు మడికొండ శివారులోని డంపింగ్ యార్డును ప్రక్షాళన చేస్తానని ఎన్నికల ముందు బహిరంగ సభలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. మంగళవారం మడికొండలోని రావి నారాయణరెడ్డి నగర్‌లో సీపీఐ శాఖ సమావేశం నిర్వహించారు. గుగులోతు రమేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో భిక్షపతి మాట్లాడుతూ మడికొండ శివారులోని డంపింగ్ యార్డులోని చెత్తాచెదారం కాల్చడంతో వచ్చే పొగతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే నాగరాజుకు, ఎంపీ కడియం కావ్యకు వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, జిల్లా సమితి సభ్యులు మాలోతు శంకర్, స్వరూప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్

న్యూశాయంపేట : తెలంగాణలోని బీసీ సంఘాలు చేసిన పోరాటాల ఫలితంగా ప్రభుత్వం డెడికేషన్ కమిషన్‌ను నియమించిందని, సమగ్ర కుల జనగణన జరిగి తద్వారా స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం సాగించాలని ఆల్‌ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ సంఘాలుగా కమిషన్‌ను స్వాగతిస్తూనే పనితీరును గమనించాలన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు వేణుమాధవ్, రాజేంద్రప్రసాద్, రవికుమార్, అమరేందర్, వెంకటాచారి, సద్గుణ, సరోజన, అశ్విని, చంద్రశేఖర్, సాయితేజ, రాఖీ, మాదవి, స్వప్నరాణి, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టిని మళ్లించడానికే అసత్య ప్రచారం

వరంగల్ : బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడానికి రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ప్రకారం దేశంలో బిహార్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణన కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టడంతో ఎక్కడ కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందో అని భయపడి బీఆర్ఎస్ పార్టీ అసత్య ప్రచారాలు చేస్తోందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగ వెంకట్రాజం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ బీసీల వ్యతిరేక పార్టీ అని గత 10 ఏళ్లలో బీసీల రిజర్వేషన్ శాతాన్ని 34 నుంచి 23 శాతానికి తగ్గించిన నిరంకుశ నాయకులు కాంగ్రెస్ పార్టీపై కాంగ్రెస్ ప్రభుత్వంపై జీఓ నంబర్ 29పై సరైన అవగాహన లేకుండా అసత్య ప్రచారం చేస్తూ నిరుద్యోగులను పక్కదారి పట్టిస్తున్నదని ఆరోపించారు. బీసీలకు మున్ముందు రాజకీయ రిజర్వేషన్లు రావాలంటే చట్టబద్ధతో కూడుకున్న కులగణన జరగాలన్నారు. కులగణన చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

సాక్షి, నెట్‌వర్క్ : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం వరంగల్ శంభునిపేట ఉర్సు ప్రతాప్‌నగర్‌లోని నాగేంద్రస్వామి ఆలయంలో, శివనగర్‌లో, హనుమకొండలోని రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల గుడిలో, అలాగే హసన్‌పర్తి, మడికొండ, కాశిబుగ్గలోని ఆలయాల్లో నాగుల చవితి పర్వదినాన్ని మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. నాగేంద్రునికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5.30 నుంచే భక్తులు బారులు తీరి ఆవు పాలతో అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



ఖిలా వరంగల్ : ఉర్సు నాగేంద్రస్వామి ఆలయంలోని పుట్టలో పాలుపోస్తున్న మహిళలు



హన్మకొండ కల్చరల్ : నాగేంద్రస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న ఉపేంద్రశర్మ, భక్తులు



హసన్‌పర్తిలో..



మడికొండ : మెట్టుగుట్టపై..



కాశిబుగ్గ : పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



కాజీపేట రూరల్ : 108 ప్రమిదలతో దీపాలంకరణ

బోరు మోటారుకు మరమ్మతులు

ఖిలా వరంగల్ : మధ్యకోటలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. కాలనీలోని బోరు మోటారు పనిచేయటం లేదు. ప్రజలు కార్పొరేటర్ ఉమ దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం ఆమె బల్దియా సిబ్బంది ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు.